కరపత్రం

సంచిక :18

SINCE 2014

సోమవారం జనవరి 12, 2026 | సంపుటి : 2 | సంచిక : 97 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు

» ఎస్ఎల్‌బీసీ పనులపై సచివాలయంలో మంత్రి ఉత్తమ్ సమీక్ష
» యుద్ధ ప్రాతిపదికన టన్నెల్ పనులు పునఃప్రారంభం
» అత్యాధునిక సాంకేతికతతో సొరంగం తవ్వకాలు
» తొలగించిన టీబీఎం స్థానంలో కొత్త పద్ధతులు
» మిగిలిన 9.8 కి.మీ సొరంగ మార్గంపై సర్వే పూర్తి
» ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వేతో భూగర్భ సమాచారం
» భూగర్భ పరిస్థితులకు అనుగుణంగా సపోర్ట్ సిస్టం
» ఎస్ఎల్‌బీసీ పూర్తి కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు
» క్షేత్ర స్థాయి సిబ్బందికి 25% అదనపు జీతాలు
» నల్గొండను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం
» ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా నిర్మూలిస్తామని హామీ

హైదరాబాద్:
ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి (ళ్ళిఎ ఖబఎిఠీ =వనఎఎ) సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన పునఃప్రారంభ పనులు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు. తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారు. మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు మంత్రికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25శాతం అదనపు జీతాలు ఉంటాయని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందన్న మంత్రి.. ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని ప్రకటించారు.

వనదేవతల వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాం

- వనదేవతలు సమ్మక్క--సారలమ్మ వైభవం ప్రపంచానికి చాటుతాం
- జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర నిర్వహణ
- ఏర్పాట్లు, గద్దెల పునర్నిర్మాణ పనుల పరిశీలన
- మేడారంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం
- ఉత్సవాలు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక
- శాశ్వత నిర్మాణాలకు రూ.251 కోట్లు కేటాయింపు
- మరో రెండు రోజుల్లో అభివృద్ధి పనుల పూర్తి
- దేశం గర్వించేలా మహాజాతర నిర్వహణ లక్ష్యం
- వనదేవతలకు దర్శనం, ప్రత్యేక పూజలు

తాడ్వాయి:
మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించి, వనదేవతలు సమ్మక్క, సారలమ్మ వైభవాన్ని ప్రపంచానికి చాటుతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లు, గద్దెల పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మేడారం సందర్శించారు. స్థానిక హరిత హోటల్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ముందుగా మీడియాతో మాట్లాడారు. ఈ ఉత్సవాలు ఆదివాసీలతో పాటు, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. అందుకే రూ.251 కోట్లు వెచ్చించి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. మరో రెండు రోజుల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయని, మహా జాతరను దేశం గర్వించేలా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులున్నారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని పూజలు చేశారు. గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. సజ్జనార్ ట్వీట్

హైదరాబాద్:
చైనా మాంజా జనం ప్రాణాలు తీస్తున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది.

2 లో

బీజేపీ Vs కాంగ్రెస్.. యాదగిరిగుట్టలో ఉద్రిక్తత

యాదాద్రి భువనగిరి:
యాదగిరిగుట్టలో రెండు గంటలుగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ స్థలం విషయంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య వివాదం నెలకొంది. ఇరు వర్గాల మధ్య మాటా మాట పెరగడంతో ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలకు గాయలైనట్టు తెలుస్తోంది.

శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిది

» సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు మొట్టికాయలు
» అయినా సర్కారు తీరు మారలేదని హరీశ్‌రావు విమర్శ
» థియేటర్ల కంటే సచివాలయంలోనే "సస్పెన్స్ థ్రిల్లర్"
» సినిమాటోగ్రఫీ మంత్రికి తెలియకుండానే జీవో జారీ
» శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిదని ఎద్దేవా
» నచ్చిన వారి సినిమాలకే టికెట్ ధరల పెంపు అనుమతులా?

హైదరాబాద్:
సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు మొట్టికాయలు వేసినా సర్కారు తీరు మారలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. థియేటర్లలో కంటే సచివాలయంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని వ్యాఖ్యానించారు. సినిమాటోగ్రఫీ మంత్రికి తెలియకుండానే ధరల పెంపు జీవో ఇచ్చారని హరీశ్‌రావు విమర్శించారు. శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిదని ఎద్దేవా చేశారు. నచ్చిన వారి సినిమాల టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇస్తారా? అని ప్రశ్నించారు.

రూ.547 కోట్ల లావాదేవీలు.. సత్తుపల్లికి చెందిన సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

- రూ.547 కోట్ల లావాదేవీలతో సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు
- సత్తుపల్లికి చెందిన ముఠాను అరెస్ట్ చేసిన ఖమ్మం పోలీసులు
- అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో జతకట్టినట్టు గుర్తింపు
- విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ మోసాలు
- మ్యూట్రిమోనీ, గేమింగ్, బెట్టింగ్, క్రిప్టో పేరుతో మోసం
- షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరిట వల
- పలు బ్యాంకు ఖాతాల ద్వారా భారీగా లావాదేవీలు
- ఖాతాలు ఇచ్చిన వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల చెల్లింపు

సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించం: తలసాని

హైదరాబాద్:
సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించేది లేదని.. కార్పొరేషన్‌తో పాటు జిల్లాను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు."ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించాం. సికింద్రాబాద్‌లో రైల్‌రోకో, బంద్‌లు నిర్వహిస్తాం. నిరవధిక దీక్షలు, అవసరమైతే ఆమరణ దీక్ష చేస్తాం. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోంది. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉంది. మేయర్‌కి కూడా తెలియకుండా డివిజన్లు విభజించారు" అని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

భూ మాఫియాకు కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తోంది - ఎంపీ ఈటల రాజేందర్

(హైదరాబాద్):
రాష్ట్రంలో రోజురోజుకు భూ మాఫియా రెచ్చిపోతుందని, వారికి అన్ని విధాలా కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలా వెంచర్‌లో శనివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడ్డ వారిని ఆయన ఆదివారం పరామర్శించారు. అనంతరం ఏకశిల వెంచర్‌ను సందర్శించి ఇంటి స్థల యజమానులతో మాట్లాడి దాడి జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. 1985లో 146 ఎకరాల్లో 2086 ఇంటి స్థలాలను చిన్నచిన్న ఉద్యోగులు కొనుగోలు చేశారని తెలిపారు.

అమర స్నేహం..! అశ్రునయనాల మధ్య ఒకేచోట అంత్యక్రియలు

బాల్యం నుంచి కలిసి చదివారు.. ప్రాథమిక విద్య మొదలుకొని ఇంజినీరింగ్ వరకు ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని స్నేహం వారిది.. చివరకు ఎంఎస్ కూడా అమెరికాలో కలిసి చేయాలనుకున్నారు.. అదే వారి చివరి మజిలీగా మారింది. గత సంవత్సరం డిసెంబరు 28న అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం వారి మృతదేహాలు స్వస్థలాలకు చేరాయి.. చివరకు బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య ఒకేచోట వారి అంత్యక్రియలు నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా గార్లవాసి పి.నాగేశ్వరరావు, శిరీష కుమార్తె పుల్లఖండం మేఘనారాణి (24), ముల్కనూరు గ్రామ ఉపసర్పంచి కె. కోటేశ్వరరావు, రేణుకల కుమార్తె భావన (25) అమెరికాలోని ఒహాయో రాష్ట్రం డేటన్‌లో ఉంటూ ఎంఎస్ చేశారు. అనంతరం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. గత డిసెంబరు 28వ తేదీన అమెరికాలోని అలబామా హిల్స్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మేఘనారాణి, భావన మృతి చెందగా శనివారం గార్లకు వారి మృతదేహాలు తీసుకువచ్చారు. యువతుల తల్లిదండ్రులు పి.నాగేశ్వరరావు, శిరీష, కె.కోటేశ్వరరావు, రేణుక రోదనలు మిన్నంటాయి.

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ.. బెల్జియంకు తెలంగాణ సీఈఓ

హైదరాబాద్:
తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి ఎన్నికల నిర్వహణలో అనుభవాల మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం లక్ష్యంగా మూడు రోజుల అధికారిక పర్యటనకు బెల్జియంకు బయలుదేరారు. బెల్జియన్ ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ -- ఇంటీరియర్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది.

హైదరాబాద్-విజయవాడ హైవేపై ఒక్కసారిగా పెరిగిన రద్దీ

చౌటుప్పల్ గ్రామీణం:

రూ.547 కోట్ల లావాదేవీలు.. సత్తుపల్లికి చెందిన సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా రూ.547 కోట్ల లావాదేవీలు జరిపిన సైబర్ క్రైమ్ ముఠా గుట్టును ఖమ్మం జిల్లా పోలీసులు రట్టు చేశారు. అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తున్న సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ముఠా పట్టుబడినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. వీఎం బంజరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. మ్యాట్రిమోనీ, రివార్డ్ పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో నిందితులు మోసగించినట్టు పోలీసులు గుర్తించారు. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పోట్రు మనోజ్ కల్యాణ్, ఉడతలేని వికాస్ చౌదరి, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రియ, మేడ సతీష్, మోరంపూడి చెన్నకేశవులుతో పాటు మరో 11 మందిని అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని పోట్రు కల్యాణ్, ప్రవీణ్, ఉడతనేని వికాస్ చౌదరితో పాటు మోరంపూడి చెన్నకేశవులు.. తనను నమ్మించి మోసం చేశారని గతేడాది డిసెంబరు 24న సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు బ్యాంకులలో ఖాతా తెరిపించి అకౌంట్లకు సంబంధించిన వివరాలు, ఏటీఎం కార్డు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు తెలిసిందని పోలీసుల దృష్టికి తెచ్చాడు.

నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా నిందితులు రూ.547 కోట్ల లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. సత్తుపల్లి, వేంసూర్, లింగపాలెం, సదాశివుడు పాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన మరో ఆరుగురు పేరిట ఖాతాలు తెరిచి వారికి రూ.5వేలు, కరెంట్ అకౌంట్ అయితే రూ.10వేలు ఇచ్చి ఏజెంట్ల ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించారు. అనంతరం ఆ ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగించుకొన్నారని సీపీ వివరించారు. నేరస్థుల బ్యాంక్ అకౌంట్‌లపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో వందల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయని తెలిపారు.

బీజేపీ Vs కాంగ్రెస్.. యాదగిరిగుట్టలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

వివరాల మేరకు.. యాదగిరిగుట్టలో ఓ వ్యక్తికి చెందిన స్థలాన్ని కబ్జా చేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని బీజేపీ కార్యకర్తలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్‌కు బీజేపీ కార్యకర్తలు వెళ్లారు. ఇదే సమయంలో పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురుపడ్డారు. దీంతో, ఇరు వర్గాల మధ్య మాటా మాట పెరగడంతో ఘర్షణ చోటుచేసుకుంది.

ఈ క్రమంలో పరిస్థితి చేయి దాటిపోవడంతో ఇరు పార్టీల కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. ఈ ఘర్షణలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలైనట్టు తెలిసింది. కాంగ్రెస్ నేత భరత్ అనుచరులు దాడి చేశారంటూ పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ శ్రేణుల ఆందోళనకు దిగాయి. దీంతో, బలవంతంగా వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో..

మొదటిపేజీ తరువాయి

ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పతంగుల పండగ నేపథ్యంలో 'గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదు' అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

చైనీస్ మాంజా దారం తెగదు.. కానీ మనుషుల మెడలు, పక్షుల రెక్కలు తెగ్గోస్తుంది. మీ క్షణికానందం.. మరొకరి ఇంట తీరని విషాదం కాకూడదు. నిషేధిత చైనా మాంజా అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. పండగని పండగలా జరుపుకోండి. ప్రాణాలు తీసి కాదు' అంటూ సజ్జనార్ హెచ్చరించారు.

కాగా, చైనా మాంజా విక్రయంపై నగర పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. దీని వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2016లో, జాతీయ హరిత ట్రైబ్యునల్ 2017లో నిషేధించింది. అయినప్పటికీ విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దీంతో నెల రోజులుగా నిఘా ఉంచిన అధికారులు ఇప్పటి వరకు 103 కేసులు నమోదు చేసి, 143 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.24 కోట్ల విలువైన 6226 బాబిన్ల మాంజా స్వాధీనం చేసుకున్నారు.

(జనవరి 11, ఆదివారం) హైదరాబాద్‌లో చైనా మాంజాకు మరో వ్యక్తి బలి అయ్యాడు. బైక్‌పై వెళ్తున్న సాయి వర్ధన్ మెడకు మాంజా చుట్టుకోవడంతో అతడి చెయ్యి, మెడకి తీవ్ర గాయమైంది. దీంతో, వెంటనే సాయి వర్ధన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో జరిగింది.

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ.. బెల్జియంకు తెలంగాణ సీఈఓ

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియల్లో పారదర్శకత, సమగ్రత, సామర్థ్యాన్ని మెరుగుపర్చే అంశాలపై రెండు దేశాల అధికారుల మధ్య విస్తృత స్థాయి చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. సీఈఓ సుధర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందంలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి, సీఈఓ కార్యాలయ రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బోయపాటి చెన్నయ్య, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఈఆర్వో కంకనాల అనంత రెడ్డి, నాంపల్లి నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నం.97 బూత్ స్థాయి అధికారి వేముల ధ్రువ కుమార్ రెడ్డి ఉన్నారు.

పర్యటనలో భాగంగా బెల్జియన్ ఎఫ్‌పీఎస్ -- ఇంటీరియర్, ఎఫ్‌పీఎస్ -- ఫారిన్ అఫైర్స్ ఉన్నతాధికారులతో సమావేశాలు, కేయూ లూవెన్ యూనివర్సిటీ నిపుణులతో చర్చలు, బ్రస్సెల్స్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో సేవా ఓటర్లతో పరస్పర చర్యలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగమని అధికారులు తెలిపారు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై ఒక్కసారిగా పెరిగిన రద్దీ

మొదటిపేజీ తరువాయి

సంక్రాంతికి వెళ్లే వాహనాలతో హైదరాబాద్-విజయవాడ హైవేపై రద్దీ కొనసాగుతోంది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వేకువజాము నుంచి రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఏపీ వైపు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఎక్కువ టోల్ బూత్‌లను ఓపెన్ చేశారు. కార్లు, ఇతర వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 70వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఇవాళ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. టోల్ ప్లాజా వద్ద వాహనాలకు ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద పెట్రోలింగ్ వాహనం, క్రేన్, అంబులెన్స్ అందుబాటులో ఉంచారు. మరోవైపు హైదరాబాద్ నుంచి వస్తున్న వాహనాలతో ఏపీలోని నందిగామ వద్ద ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో వైజంక్షన్ వద్ద రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం
- నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని పారిశుద్ధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి?ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షోభంలోకి నెడుతూ.. మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను? ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరపున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను, అధికార దుర్వినియోగాన్ని తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని.. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీష్ రావు పలు అంశాలపైన నేతలకు దిశా నిర్దేశర చేశారు. కలిసికట్టుగా సమిష్టిగా కొట్లాడి ఎన్నికల్లో మంచి విజయం సాధించాలని హరీష్ రావు సూచించారు. ఈ సందర్భంగా పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన పలు అంశాలను హరీష్ రావు నేతలకు వివరించారు.ఈ సమావేశాల సందర్భంగా ఆయా జిల్లాల నేతలు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు వివరించారు. ప్రభుత్వం పైన క్షేత్రస్థాయిలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని పార్టీకి అనుకూల వాతావరణ ఉన్నదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

ఘనంగా ముగిసిన ఆవకాయ అమరావతి ఉత్సవాలు

రెండ్రోజుల పాటు ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడలోని పున్నమి ఘాట్‌లో రెండో రోజు ఆవకాయ అమరావతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సినిమా, సంస్కృతి, సాహిత్యాల సమ్మేళనంగా కొనసాగిన ఈ ఉత్సవాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణానది తీరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవ వాతావరణాన్ని మరింత సొగసుగా మార్చాయి. సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు సినీ సాహిత్యంపై జరిగిన చర్చలు మంచి స్పందన పొందాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు పున్నమి ఘాట్‌ను కళా, సాంస్కృతిక వేదికగా నిలిపాయి. ఈ కార్యక్రమాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీకళ తదితరులు హాజరై కళాకారులను అభినందించారు. కాగా, రాష్ట్ర సంస్కృతి, వంటకాలు, సృజనాత్మక రంగాలను ప్రోత్సహించేలా ఈ ఫెస్టివల్‌లో 28 ప్రత్యేక ఈవెంట్లు, 4 వర్క్‌షాప్‌లు నిర్వహించారు.. ప్రపంచంలో ఫుడ్ అంటే భారతదేశం.. భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు వచ్చే స్థాయికి మన వంటకాలకు ఖ్యాతి ఉంది అంటూ ఆంధ్ర వంటల గొప్పదనాన్ని సీఎం చంద్రబాబు.. ఈ ఉత్సవాల ఆరంభంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉత్సవాలు, సంబరాలు లేక ప్రజల్లో నవ్వులు కూడా కరువయ్యాయని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్, అమ్మవారి దసరా ఉత్సవాలను ప్రపంచస్థాయిలో నిలబెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు దసరా అంటే విజయవాడ గుర్తుకు వచ్చేలా ఉత్సవాలు నిర్వహించాం అని చెప్పారు. ఇక, తెలుగు సినీ చరిత్ర గురించి ప్రస్తావించిన సీఎం చంద్రబాబు.. భక్త ప్రహ్లాద నుంచి బాహుబలి వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో ప్రయోగాలు చేసింది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణాజిల్లా నుంచే వచ్చి సినిమా రంగానికి దిక్సూచిగా నిలిచారు.. పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు తెలుగు సినిమాను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్నారు అని కొనియాడారు. కృష్ణాజిల్లా సంపద సృష్టిలో, వ్యాపార చొరవలో ఎప్పుడూ ముందే ఉంటుందని సీఎం ప్రత్యేకంగా ప్రశంసించిన విషయం విదితమే..

అదుపులోకి వచ్చిన బ్లో ఔట్ పూర్తిగా ఆగిపోయిన మంటలు

- స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జీసి
- ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

అమర స్నేహం..! అశ్రునయనాల మధ్య ఒకేచోట అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి

గార్ల, ముల్కనూరులో ఉన్న వీరి మృతదేహాలను చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, సర్పంచులు పార్వతి, వెంకట్రావు మృతదేహాల వద్ద నివాళులర్పించారు.

ముల్కనూరులో ఇద్దరికి అంతిమ సంస్కారాలు: గార్ల, ముల్కనూరులో మృతదేహాలకు ఊరేగింపు నిర్వహించిన అనంతరం ముల్కనూరులో ఉపసర్పంచి కె.కోటేశ్వరరావుకు చెందిన పొలంలో మేఘనారాణి, భావన స్నేహానికి గుర్తుగా ఒకే చోట అంత్యక్రియలను నిర్వహించారు.

జ్ఞాపకాలను స్మరించుకుంటూ..: పద్నాలుగు రోజులపాటు తడారిన కన్నులతో తమ కూతుళ్ల మృతదేహాల కోసం ఆ తల్లిదండ్రులు నిరీక్షించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అసిస్టెంట్ సీనియర్ మేనేజరు గంగావత్ వెంకన్న మృతదేహాలను తరలించేందుకు తనవంతు సహాయం చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మృతదేహాలు రావటంతో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ముల్కనూరులో ఇద్దరికి కడసారి వీడ్కోలు పలికారు.

భూ మాఫియాకు కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తోంది

మొదటిపేజీ తరువాయి

భూ మాఫియా లీడర్ వెంకటేశ్ రెవెన్యూ రికార్డుల్లో ఉండే లొసుగులను ఆసరా చేసుకొని, రెవెన్యూ విభాగంలోని అవినీతి అధికారులు, భూమి యజమానితో కలిసి ఏకశిలా వెంచర్‌లో 47 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. డబ్బులకు ఆశపడి అప్పటి రెవెన్యూ అధికారులు గుండాలకు మద్దతిచ్చారన్నారు. సింగరేణిలో ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, కూరగాయాలు, పాలు అమ్ముకొనే వారు ఇక్కడి స్థలాలను కొనుగోలు చేశారన్నారు. వారిని బెదిరించి స్థలాలను కాజేయాలని వెంకటేశ్ చూస్తున్నాడని, ఇది ముమ్మాటికి సాగదని స్పష్టం చేశారు. పోలీసులు ఉన్నది చట్టాన్ని కాపాడటానికి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి.. గుండాల మీద ఉక్కు పాదం మోపడానికి లా అండ్ ఆర్డర్ కాపాడటానికి.. కానీ భూ మాఫియాకు పూర్తిగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.

డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలు

భారత డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలకు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరికి ప్రతిష్ఠాత్మక 'అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు-2025'ను సౌత్‌జోన్ ప్రదానం చేసింది. డెయిరీ పరిశ్రమ అభివృద్ధిలో ఆమె చూపిన దూరదృష్టి నాయకత్వం, రైతుల సాధికారతకు చేసిన విశేష కృషి, డెయిరీ ఎకోసిస్టంపై ఆమె కల్పించిన సానుకూల ప్రభావాన్ని గుర్తిస్తూ ఈ అవార్డు వరించింది. ఈనెల 9న కేరళలోని కోజికోడ్‌లో కాలికట్ ట్రేడ్ సెంటర్, డాక్టర్ వర్గీస్ కురియన్ నగర్‌లో నిర్వహించిన సదరన్ డెయిరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్-2026 ప్రారంభ సమావేశంలో ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జె.చించు రాణి చేతుల మీదుగా భువనేశ్వరి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తన సతీమణి నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారాయన. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం భువనేశ్వరి సహా ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపని సీఎం పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందన్నారు.

తిరుమల దర్శనాలను కమర్షియల్ చేసిన ఘనత జగన్‌దే

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని వైసీపీ పాలనలో భక్తి కేంద్రం నుంచి వ్యాపార కేంద్రంగా మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ విమర్శలు గుప్పించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. దేవుడంటే భయం- భక్తి లేని వ్యక్తులను టీటీడీ ఛైర్మన్, సభ్యులుగా నియమించి దర్శనాలను కమర్షియల్‌గా మార్చిన దుస్థితి జగన్ హయాంలోనే జరిగిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో వీఐపీ దర్శనాలను గణనీయంగా తగ్గించి సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ముక్కోటి ఏకాదశి రోజున లక్షలాది మంది భక్తులు వచ్చినా ఎక్కడా అపశృతి జరగకుండా ప్రశాంతంగా ఉత్తర ద్వార దర్శనం నిర్వహించడం కూటమి ప్రభుత్వ పరిపాలనకు నిదర్శమని మంత్రి వాసంశెట్టి వెల్లడించారు. కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి సిట్ విచారణలో బంగారం, నగదు సీజ్ కావడం వైసీపీ పాలనలో జరిగిన అవినీతికి సాక్ష్యమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోటోజు అశోక్ ఆధ్వర్యంలో కిసాన్ నగర్ 28వ డివిజన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 11

ఆదివారం కిసాన్ నగర్ 28వ డివిజన్ లో జెండా ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ కార్పొరేషన్ డిసిసి అర్బన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ జెండా కార్యక్రమం ఆవిష్కరణ చేశారు. జెండా కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రోళ్ళ సతీష్,దికొండ శేఖర్ బాబు ,మంద మహేష్, పొన్నాల రాజేష్,దేవరాజ్, విజయ్,ప్రశాంత్,రంగోజు నరేష్, శ్రీకాంత్, కిరణ్, చందు, అరుణ్, హరీష్, దిలీప్, లడ్డు,కాంగ్రెస్ పార్టీ వివిధ సంఘాల నాయకులు , కార్యకర్తలు ,అభిమానులు, యూత్ నాయకులు ,డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జెండా కార్యక్రమం విజయవంతం చేశారు.

శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న జబర్దస్త్ నటుడు ఫణి

కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో ప్రముఖ హాస్య నటుడు కవులూరి వెంకట ఫణి కుమార్ అలియాస్ జబర్దస్త్ ఫణి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచన మండపంలో అర్చకులుఆశీర్వచనం గావించగా, ఆలయ పర్యవేక్షకులు ఎన్.రాజేందర్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ జబర్దస్త్ ఫణికి శేష వస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్ల పంపిణీ

కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ పట్టణంలో చలి తీవ్రతను తట్టుకోలేక రాజన్న ఆలయ సమీపంలో ఇబ్బంది పడుతున్న యాచకులకు, నిరాశ్రయులకు యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు గొడిశెల తిరుపతి మాట్లాడుతూ యువ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పోలీస్, ఆర్మీ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు, ఉద్యోగం లో చేరిన యువతీ యువకులు ఇలాంటి సేవా కార్యక్రమాలలో పాల్గొని సమాజ సేవ చేయటం అభినందనీయం యువకులను అభినందించారు. అనంతరం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ చలి తీవ్రత అధికంగా ఉన్నందున, వృద్ధులు, నిరాశ్రయులు చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నారని, అలాంటి వారిని గుర్తించి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్, యువ ఫౌండేషన్ ఉద్యోగులు రాజు, అరవింద్, అభ్యర్థులు మనోజ్, వినయ్,రామ్ కుమార్,మోహన్,రాహుల్, హేమంత్, రాకేష్, ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ గడ్డం ప్రశాంత్, చిన్నారులు సింధూజ,సిరి చందన,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో భక్తులు సందడి

- మొక్కులు చెల్లించుకొని స్వామివారిని దర్శించుకున్న భక్తులు

కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి బాలాలయంగా రూపుదిద్దుకున్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సమ్మక్క--సారలమ్మ జాతర ప్రారంభం కావడంతో మొదటగా రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ.. అందులో భాగంగా భక్తులు వేములవాడకు విచ్చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకొని, భీమన్నను దర్శించుకున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులు అనంతరం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారికి కోడె మొక్కలు, వివిధ రకాల మొక్కులు భక్తిశ్రద్ధలతో చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో భక్తుల తాకిడి పెరుగుతుండడంతో రద్దీ కనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. భక్తులు స్వామివారిని సులభతరంగా దర్శించుకునే విధంగా ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కరపత్రం ప్రతినిధి వేములవాడ

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ అర్బన్ మండలం పరిధిలో అర్హులైన 25 మంది లబ్ధిదారులకు 07 లక్షల 95 వేలు,వేములవాడ రూరల్ మండల పరిధిలోని 30 మంది లబ్ధిదారులకు 8 లక్షల 91 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు..

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదాదేవి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడు: కేటీఆర్

మహేశ్వరం:రాజేంద్రనగర్ జనవరి 11,కరపత్రం ప్రతినిధి

నిరుద్యోగుల ఆందోళనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి: బీఆర్ఎస్ డిమాండ్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడని, అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను ఒక్కటినీ అమలు చేయకుండా 24 నెలలుగా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.ఈ రోజు తెలంగాణ భవన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రెట్టింపు పెన్షన్లు, రైతుబంధు, దళిత బంధు, రెండు లక్షల ఉద్యోగాలు, పీఆర్‌సీ వంటి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం కనీస స్పందన చూపడం లేదని మండిపడ్డారు.నిరుద్యోగ యువతీ--యువకులను వెంటనే పిలిచి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని, ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవలం మీడియా హెడ్‌లైన్ల కోసమే విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను వాస్తవంగా అమలు చేయాలని కోరారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళనలను ప్రభుత్వం గౌరవించాలని సూచించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బట్టల షాపు ప్రారంభోత్సవానికి వెళ్లిన ముఖ్యమంత్రి, పక్కనే ఉన్న గాంధీనగర్‌లో నిరుద్యోగులతో సమావేశం కావడానికి ఎందుకు వెళ్లలేదని కేటీఆర్ ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నియామక పత్రాలను చూపించి అవి తనవేనని చెప్పుకోవడం పూర్తిగా అబద్ధమని, ఇటువంటి మోసాలు ఎక్కువ కాలం నిలవవని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి రైతులు, రైతు కూలీలు, కౌలుదారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి బూతుల భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి తెలిసిన ఏకైక భాష అదే అని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ పార్టీ 24 నెలల వైఫల్య పాలన కారణంగా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దిగజారాయని, వ్యాపారాలు కుదేలయ్యాయని, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని తెలిపారు. ఈ పరిస్థితికి పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని, గత పది సంవత్సరాల్లో హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. గతంలో ఉన్న కరెంట్ కోతలు, తాగునీటి సమస్యలు, అస్తవ్యస్త రోడ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించిందని గుర్తు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యలు 90 శాతం పైగా పరిష్కరించామని తెలిపారు.

పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి దయనీయంగా మారిందని కేటీఆర్ విమర్శించారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలమని, స్పీకర్ వద్ద మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరడానికి గల అభివృద్ధి కారణాలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌కు రావాల్సిన మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసిన అంశంపై సీఎం రేవంత్ రెడ్డితో కలిసి సమాధానం చెప్పాలని కేటీఆర్ కోరారు.

13న కరీంనగర్ కు వెలిచాల రాజేందర్ రావు రాక.

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 11

అల్గునూరు చౌరస్తా నుంచి భారీ ర్యాలీ ఘన స్వాగత కార్యక్రమం

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు మొట్టమొదటిసారిగా ఈ నెల 13వ తేదీన మంగళవారం కరీంనగర్ రానున్నారు. అలుగునూరు చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ వివిధ సంఘాల నాయకులు ముఖ్యులు, అభిమానులు వెలిచాల రాజేందర్ రావుకు ఘన స్వాగతం పలుకనున్నారు. అనంతరం వారితో కలిసి భారీ ర్యాలీ మధ్య వెలిచాల రాజేందర్ రావు గీత భవన్ చౌరస్తా వద్దకు చేరుకుంటారు. అక్కడ జరిగే సంబురాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1:00గంటకు డిసిసి కార్యాలయంలో రాజేందర్ రావు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు మాజీ ఎమ్మెల్యేలు వివిధ నామినేటెడ్ హోదాల్లోని నాయకులు ముఖ్య నేతలు. బ్లాకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధాల సంఘాలు అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు, జిల్లా కార్యవర్గ సభ్యులతోపాటు కాంగ్రెస్ నాయకులు,పలువురు నేతలు హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు కార్యకర్తలు వెలిచాల అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వెలిచాల ప్రజా కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఐఏంఏ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు

- తెలంగాణ పల్లెల సంప్రదాయాలను మైమరిపించిన సంక్రాంతి వేడుకలు

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 11

తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను తలపించేలా ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలు కన్నుల పండుగగా, అంగరంగ వైభవంగా సాగాయి. తెలంగాణ ఆచారాల ప్రకారం పిల్లలకు భోగిపండ్ల రుమోత్సవం, సంప్రదాయ వంటకాలతో ఆడంబరంగా భోజన కార్యక్రమం నిర్వహించామని ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్రాంతి వేడుకలు కేవలం పండుగ పరిమితంగా కాకుండా మన సంస్కృతి, విలువలను భావితరాలకు పరిచయం చేసే వేదికలుగా నిలుస్తాయన్నారు. వైద్యులు తమ బిజీ వృత్తి జీవితంలో నుంచి కొంత విరామం తీసుకొని ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం మానసిక ప్రశాంతతనూ, సామాజిక అనుబంధాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బొమ్మల కొలువు, భోగిమంటలు, గంగిరెద్దులు, హరిదాసు వేషధారణలతో పల్లె వాతావరణాన్ని సజీవంగా ప్రతిబింబించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి.

ఈ వేడుకలకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి. కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవడంలో ఇటువంటి సంఘాల పాత్ర కీలకమని ప్రశంసించారు. ఉమెన్స్ డాక్టర్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ స్వీటీ అనూప్, మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.ఎన్. రావు, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ శోభ, డాక్టర్ అలీమ్, డాక్టర్ ఎం.ఎల్.ఎన్. రెడ్డి తదితర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. ?

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జనవరి 12, 2026

ప్రజాకవి తత్వవేత్త బ్రహ్మశ్రీ ఆధ్యాత్మిక విశ్వ గురువు డాక్టర్ నాగుల సత్యం గౌడ్ కు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డు లో చోటు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జనవరి 11
కరీంనగర్ జిల్లా హుజరాబాద్ పట్టణానికి చెందిన మానవ విలువల పరిరక్షణ జాతి అధ్యక్షులు, ప్రజాకవి రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణులు, అంతర్జాతీయ స్థాయి వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత, తత్వవేత్త బ్రహ్మశ్రీ ఆధ్యాత్మిక విశ్వ గురువు డాక్టర్ నాగుల సత్యం గౌడ్ సామాజిక సేవలు రచనలు వారి ఆధ్యాత్మిక సేవలను ఇంటర్నేషనల్ గ్లోబల్ ఈవెంట్ మరియు అంతర్జాతీయ భారత్ వరల్డ్ రికార్డ్ పలు సంస్థల వ్యవస్థాపకులు కదరి వెంకటరమణ రావు ... సత్యం గౌడ్ సేవలను గుర్తించి ... వీరిని ఇంటర్నేషనల్ యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డుకు ఎంపిక చేసి, ఈ యొక్క అవార్డును హైదరాబాదులోని రవీంద్ర భారతి మెయిన్ హాల్లో .. పలు సంస్థల వ్యవస్థాపకులు కదిరి వెంకట రమణారావు, ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథి ఫార్మర్ చైర్మన్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ తెలంగాణ స్టేట్, కోలేటి దామోదర్

గుప్తా మరియు డాక్టర్ శివ నాగార్జున రెడ్డి, ఫిలిం ఆర్టిస్టు ఐశ్వర్య, డాక్టర్ పి. ఝాన్సీరామ్ సత్యంగాడుకు పట్టు శాలువా కప్పి, మెడల్ ధరింపజేసి, బొకేను అందజేసి, సన్మాన పత్రంతో పాటు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు ప్రధానం చేసి ఆదివారం ఘనంగా సన్మానించారు .. ఈ సందర్భంగా ఈ యొక్క కార్యక్రమ నిర్వాహకులు, ఈ కార్యక్రమంకు వచ్చిన ముఖ్య అతిథి కోలేటి దామోదర్ గుప్తా, దైవజ్ఞ శర్మ, డాక్టర్ శివ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ... సత్యం గౌడ్ ఆధ్యాత్మిక సేవలు, వారి రచనలు సామాజిక సేవలు, వెలకట్టని విలువలన్నారు. ఇంతటి అపార జ్ఞానం కలిగిన సత్యం గౌడ్ దైవాంశ సంభూతులన్నారు. ఇంతటి ఆధ్యాత్మికంగా మనం ఏర్పరచుకున్న విలువలపై అనార్గళంగా మాట్లాడే శక్తి కలిగిన సత్యం గౌడ్ సమాజానికి ఎంతో ఉపయోగపడటం అభినందనీయం అన్నారు. అనంతరం ఆధ్యాత్మిక విశ్వగురువు సత్యంగాడు మాట్లాడుతూ ... ప్రతి ఒక్కరూ మనసును అదుపులో పెట్టుకొని, మనసు నిర్మలం పరుచుకొని ప్రశాంతంగా బతకాలి అన్నారు. ఎందరో కళాకారులను, ఆర్టిస్టులను నృత్య కళాకారులను కవులను రచయితలను సామాజిక వేత్తలను ప్రోత్సహిస్తూ వారిని ఆదరిస్తూ వారిలో ఉన్న ప్రతిభను బయటికి తీసి ఎందరికో వారి సంస్థల వక్షణ అవార్డులు రివార్డులు సత్కారాలు చేసి తనదైన శైలిలో వెంకట రమణారావు చేస్తున్న వారి సేవలు అపారమన్నారు. మనుషులు ఒకరికి ఒకరు నష్టం చేసుకోకుండా మనిషి మనిషికి సహకరించే దృక్పథాన్ని అలవర్చుకొని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. మనిషి జన్మలో మనిషికి మహోన్నతమైన మంచి మనసు ఉంటుందని, ఆ యొక్క మనసును సత్ప్రయోజనాలకు, సేవా భావాలకు ఆదర్శప్రాయంగా మెదులుతూ, మనం ఏర్పరచుకున్న మంచి మానవత్వాన్ని కాపాడుకుంటూ, ఆదర్శవంతంగా జీవించలనున్నారు. సమాజాని, కిదేశానికి మూల స్తంభాలాంటి వారు నేటి యువత విద్యార్థులేనని, ఇందుకు ప్రతి విద్యార్థి ప్రయోజకుడుగా ఎదిగి నవ సమాజ నిర్మాణానికి పునాదిగా నిలవాలన్నారు. విద్యార్థులు యువత చెడు వేసినాలకు దూరంగా ఉండి దేశ అభివృద్ధికి తోడ్పడుతూ, సమాజ సేవలో భాగస్వాములు కావాలని సత్యంగాడు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు అంటరాని స్వార్థాన్ని వదులుకొని లోక కళ్యాణంలో భాగస్వాములు కావాలని సత్యంగాడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల వ్యవస్థాపకులు, సామాజికవేత్తలు గురువులు కవులు రచయితలు డాన్స్ మాస్టర్లు, టీవీ సీరియల్ ఆర్టిస్టులు, నటులు నృత్య కళాకారులు వారి యొక్క పేరెంట్స్తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలే ప్రాణ రక్షణకు మూలాధారం

– హుజురాబాద్ ఎంవీఐ కంచి వేణు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్,జనవరి:11
రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని, తద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చని హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఎంవీఐ కంచి వేణు మాట్లాడుతూ, వాహనాల్లో పరిమితికి మించి లోడ్ మోసుకెళ్లడం లేదా అనుమతికి మించి ప్రయాణికులను రవాణా చేయడం భారతీయ రహదారి భద్రతా నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఓవర్‌లోడింగ్ వల్ల వాహనాలపై నియంత్రణ తగ్గిపోతుందని, అధిక బరువు కారణంగా బ్రేకులు సరిగా పనిచేయక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.
అలాగే పరిమితికి మించిన బరువు కారణంగా వాహనాల టైర్లు పేలిపోయే ప్రమాదం ఉండడంతో పాటు, వాహనం సడన్‌గా ఆగిపోవడం లేదా బోల్తా పడే అవకాశాలు కూడా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ విధమైన ప్రమాదాల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబాలు రోడ్డు

ప్రమాదాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ఓవర్‌లోడ్ వాహనాల వల్ల రహదారులు వేగంగా పాడైపోతాయని, దీని వల్ల ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. రోడ్ల మరమ్మతులకు కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఓవర్‌లోడింగ్ ఒకటని అన్నారు. అందువల్ల ప్రతి వాహన యజమాని తన వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సి)లో పేర్కొన్న గ్రాస్ వెహికల్ వెయిట్ (జీవీడబ్ల్యూ)ను ఎట్టి పరిస్థితుల్లోనూ మించకూడదని సూచించారు.
ప్రయాణికుల వాహనాల విషయానికొస్తే, సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపారు. ముఖ్యంగా ఆటోలు, బస్సులు, ట్రాక్టర్లు, టాటా ఏసులు వంటి వాహనాల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం అత్యంత ప్రమాదకరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని హెచ్చరించారు.
నిబంధనలు అతిక్రమించిన వాహనాలను గుర్తించినప్పుడు, అదనపు లోడ్‌ను డ్రైవర్ లేదా వాహన యజమాని స్వంత ఖర్చుతో అక్కడికక్కడే అన్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా నిబంధనలు ఉల్లంఘించిన డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల పాటు రద్దు చేయడంతో పాటు, అవసరమైతే వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను కూడా సస్పెండ్ చేయవచ్చని హెచ్చరించారు.
రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, కేవలం రవాణా శాఖ అధికారుల మీదే బాధ్యత వేసి తప్పించుకోవద్దని ఆయన అన్నారు. వాహనదారులు స్వయంగా బాధ్యత తీసుకొని రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను పూర్తిగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఈ అవగాహన కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ కత్తుల నాగరాజు, హోంగార్డ్ సురేష్ తదితరులు పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమని ఎంవీఐ కంచి వేణు తెలిపారు.

రెస్పాన్సిబుల్ ఫౌండేషన్ చైర్మన్ పొనగంటి హేమలత పుట్టినరోజుడ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ సిబ్బంది

రంగారెడ్డి జిల్లా:చంపాపేట్ డివిజన్, జనవరి 11, కరపత్రం ప్రతినిధి
చంపాపేట్ డివిజన్ లో ఈ రోజు రెస్పాన్సిబుల్ ఫౌండేషన్ చైర్మన్ పొనుగంటి హేమలత పుట్టిన రోజు సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు మున్సిపల్ సిబ్బంది జ్ఞాపికను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఫౌండేషన్ చైర్మన్ పొనుగంటి హేమలత, మున్సిపల్ సిబ్బంది ప్రజల ఆరోగ్యం కోసం తమ స్వంత ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. మున్సిపల్ సిబ్బందికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారికి ఏ విధమైన సేవ చేసినా దానిని ముక్తి ఫలంగా భావిస్తానని తెలిపారు. వారికి ఎలాంటి సహాయం అవసరం ఉన్నచో మానవతా దృక్పథంతో ప్రతి ఫలాపేక్ష లేకుండా సహాయం చేయగలనని ఆమె మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శరత్ బాబు, సంతోష్, బాయమ్మ, సంపూర్ణ, నీలమ్మ, బి. భారతమ్మ, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

పాత వేతనాలు కొనసాగించకుంటే నేటి నుంచి విధుల బహిష్కరణ

కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జనవరి 11:
పాత వేతనాలైన రూ. 23,800 కొనసాగించకుంటే సోమవారం నుంచి అద్దె వాహన డ్రైవర్లందరూ విధులు బహిష్కరిస్తున్నట్లు ఐఎన్టియూసి అనుబంధ అద్దె వాహన డ్రైవర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు భూమళ్ల చందర్ తెలిపారు. ఎన్టిపిసి పిటిఎస్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డ్రైవర్ల తో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్టిపిసి యాజమాన్యం కొత్త వాహనాలను అద్దె ప్రాతిపదికన తీసుకుందని తెలిపారు. ఇందులో వాహన యజమానులు తక్కువ వేతనాలకు కొత్తవారిని డ్రైవర్లు గా తీసుకొని పాత డ్రైవర్లను వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు. గతంలో ఎన్టిపిసీ యజమాన్యం, వాహన యజమానులతో కలిసి తాము వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోవడంతో అద్దె వాహనాల అద్దెలను యాజమాన్యం పెంచిందని గుర్తు చేశారు. కొత్తగా అద్దె వాహన కాంట్రాక్టు పొందిన యజమానులు 20 ఏళ్లుగా పనిచేస్తున్న డ్రైవర్లను పక్కన పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. పాత డ్రైవర్ల కొనసాగింపుపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సానుకూలంగా స్పందించి.. న్యాయం చేయాలని ఎన్టిపిసిని కూడా ఆదేశించారని వివరించారు. సోమవారం నుంచి అద్దె వాహన యజమానులు పాతవేతనం కొనసాగించకుంటే విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డ్రైవర్లు ఈ.శ్రీనివాస్ యాదవ్, బి.సాగర్, బి.ప్రశాంత్, టి.నరేష్, పి.సంతోష్ యాదవ్, ఎం.సతీష్, ఎస్.ధనుంజయ్, ఎం.శ్రీరాములు, నారాయణ, రాజేందర్, వంశీ, మధు, అజయ్, సాయికుమార్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం.. మానవత్వాన్ని చాటుకున్న గ్రామీణ వైద్యులు

కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జనవరి 11:
మండల పరిధిలోని చిన్న కోమటి పల్లె గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు తిరునగరి వేణుగోపాల్ సతీమణి వైష్ణవి ఇటీవల అకాలంగా మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ హృదయవిదారక ఘటనతో దిగ్భ్రాంతికి గురైన గ్రామీణ వైద్యులు, మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.జిల్లా అధికార ప్రతినిధి పైడిపల్లి భీమన్న ఆధ్వర్యంలో ఆదివారం వేణుగోపాల్ నివాసానికి చేరుకున్న వైద్యులు, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పుతూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.
అనంతరం వైష్ణవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడున్న వారంతా మౌనం పాటిస్తూ ఆమెకు నివాళులర్పించడంతో వాతావరణం విషాదంగా మారింది. చిన్న వయసులోనే వైష్ణవి మృతి చెందడం పట్ల పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి పైడిపల్లి భీమన్న మాట్లాడుతూ, వేణుగోపాల్ కుటుంబానికి ఈ కష్టసమయంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. “ప్రాణ నష్టం ఎప్పటికీ తీరదు.. కానీ మనం చూపించే సానుభూతి, సహాయం కొంతైనా మనోధైర్యాన్ని ఇస్తుంది” అని పేర్కొన్నారు. వేణుగోపాల్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.
గ్రామీణ వైద్యుల ఐక్యతను చాటుతూ జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు చెందిన పలువురు వైద్యులు ముందుకొచ్చి బాధిత కుటుంబానికి రూ. 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా, సమాజానికి మానవీయ సేవలు అందించడంలో గ్రామీణ వైద్యులు ముందుంటారని ఈ సందర్భంగా మరోసారి రుజువైంది.
ఈ సహాయ కార్యక్రమం గ్రామస్థుల మన్ననలను పొందింది. కష్టకాలంలో తోడుగా నిలిచిన వైద్యుల చర్యను గ్రామ ప్రజలు అభినందించారు. సమాజంలో ఐక్యత, సహకారం ఎంత అవసరమో ఈ సంఘటన చాటి చెప్పిందని పలువురు వ్యాఖ్యానించారు.
ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల అధ్యక్షుడు మండల జయమూర్తి, వేముల అశోక్, సలీం పాషా, పంజాల తిరుపతి, ధీటి భీమన్న, కొడం శంకర్, నాగేశ్వర్ రావు షిండే, ఆశోక్ రాజేందర్, హరి, శీను, చిరంజీవి, దామోదర్, తుక్కారావు తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.
గ్రామీణ వైద్యులు చూపిన ఈ మానవీయ స్పందన సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఇలాంటి సహాయక చర్యలు మరింత మందికి ప్రేరణగా మారాలని పలువురు అభిప్రాయపడ్డారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంఖుస్థాపన చేసిన సుడా చైర్మన్

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 11
26 వ డివిజన్ ఆదర్శనగర్ లో 20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇరుకు రోడ్లు ఉన్న చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని దీని వల్ల రోడ్లు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని

అన్నారు.చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని ఉందని ఒక్కొక్కటి గా అన్ని రోడ్లు డ్రైనేజీలను మెరుగు పరచుకుంటూ ముందుకు వెళ్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్,మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,దండి రవీందర్,గీసా శ్రీనివాస్,మన్నె పద్మారావు,కొందటి లక్ష్మినారాయణ, మన్నె పద్మావతి,గీసా కాంతమ్మ,దినేష్,సిగిరి రవి,కుంభం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్రవేశించేందుకు యత్నం

భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఓ చైనా మహిళ అరెస్ట్ అయ్యారు. ఆమెను ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా ఇండో-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సశస్త్ర సీమా బల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. సదరు మహిళల వద్ద ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా ఆమె పేరు హువాజియా జీ అని, ఆమెను చైనా దేశీయురాలిగా గుర్తించినట్టు నౌతన్వా స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. సరైన వీసా, పాస్‌పోర్టులు లేకుండానే హువాజియా ఇండియాలోకి చొరబడేందుకు ప్రయత్నించిందనీ. అందుకే ఆమెను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.